సాక్షి కర్నూలు

ఆదివారం । 6 । ఆగస్టు । 2023



నిలిచిపోయిన ఇన్‌ఫ్లో
గూడూరు: సుంకేసుల జలాశయానికి ఇన్‌ఫ్లో నిలిచిపోయింది. డ్యాంలో 1.068 టీఎంసీల నీరు నిల్వ ఉంది. తాగునీటి కోసం కేసీ కెనాల్‌కు 130 క్యూసెక్కుల నీరు వదులుతున్నారు.



స్నేహ బంధం.. సేవా సుగంధం
కొందరు మిత్రులు బృందాలుగా ఏర్పడి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆపన్నులకు, అన్నార్తులకు సాయం చేస్తున్నారు. స్నేహితుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.. 10లో



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,627.49
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:85.010
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:10,724
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:5,484

న్యూస్‌రీల్

రెండు నెలల్లో క్లస్టర్ వర్సిటీ పనులు పూర్తి

● ఏపీఈడబ్ల్యూఐడీసీ సీఈ గోపీచంద్



పనులను పరిశీలిస్తున్న సీఈ గోపీచంద్

కర్నూలు(అర్బన్): నగర శివారులోని జగన్నాథగట్టుపై రూ.88.50 కోట్లతో చేపట్టిన క్లస్టర్ యూనివర్సిటీ పనులను రెండు నెలల్లోగా పూర్తి చేయాలని ఏపీఈడబ్ల్యూఐడీసీ చీఫ్ ఇంజినీరు గోపీచంద్ సూచించారు. శనివారం సాయంత్రం ఆయన ఈఈలు శివశంకర్, అన్వర్‌బాషాతో కలిసి వర్సిటీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ... చేపట్టిన పనుల్లో పూర్తి నాణ్యత ఉండాలన్నారు. నిర్మాణాలకు సంబంధించిన ఏవైనా ఇబ్బందులు ఉంటే, తమకు తెలియజేస్తే వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఈ మల్లికార్జునరెడ్డి, కాంట్రాక్టర్ శశి తదితరులు ఉన్నారు.

ఉమ్మడి జిల్లాలో ఒక మోస్తరు వర్షాలు

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని పలు మండలాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. శుక్రవారం ఉదయం నుంచి శనివారం ఉదయం వరకు కర్నూలు జిల్లాలో 9 మండలాలు, నంద్యాల జిల్లాలో 18 మండలాల్లో వర్షం కురిసింది. నంద్యాల జిల్లాలోని దొర్నిపాడులో 10.2 మి.మీ, కర్నూలు జిల్లా పరిధిలోని కర్నూలు రూరల్‌లో 4.8 మి.మీ అత్యధిక వర్షపాతం నమోదైంది.

జలాధివాసానికి చేరువలో సంగమేశ్వర ఆలయం



సంగమేశ్వర ఆలయ శిఖరానికి చేరిన కృష్ణాజలాలు

కొత్తపల్లి: సప్తనది సంగమ ప్రాంతంలో వెలసిన సంగమేశ్వరాలయ శిఖరానికి కృష్ణానది జలాలు చేరుకున్నాయి. ఎగువన ఉన్న జూరాల ప్రాజెక్ట్ నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండటంతో శ్రీశైల జలాశయం నీటిమట్టం 860 అడుగులకు చేరుకుంది. దీంతో రిజర్వాయర్ వెనుక జలాలు ప్రాచీన సంగమేశ్వరాలయం గోపుర శిఖరాన్ని తాకాయి. మరో 5 అడుగుల మేర నీటిమట్టం పెరిగితే సంగమేశ్వరాలయం పూర్తిస్థాయిలో జలాధివాసం కానుంది.

ప్రమాదకర ఫ్యాక్టరీలపై ప్రత్యేక నిఘా

● ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్ నారాయణరెడ్డి

కర్నూలు(సెంట్రల్): భద్రతాపరంగా రాయలసీమ ఆల్కాలిస్, బీపీసీఎల్ ఎల్‌పీజీ యూనిట్లు అత్యంత ప్రమాదకరమైనవని, వాటిపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. శనివారం ఆర్‌డీఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అత్యంత ప్రమాదకర ఫ్యాక్టరీలతోపాటు ఇతర వాటిలో కూడా ప్రమాదాలు జగరకుండా గట్టి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఆర్‌డీఓ హరిప్రసాదు మాట్లాడుతూ.. ఆధునిక టెక్నాలజీని వినియోగించుకొని ప్రమాదాలను నివారించేందుకు ఫ్యాక్టరీల యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలన్నారు. వాడుకలో ఉన్న వివిధ పరికరాలను తరచూ పరిశీలించి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐ శ్రీరామ్, కర్నూలు ఎంపీడీఓ అజంఖాన్ తదితరులు పాల్గొన్నారు.

పచ్చ నోట్లకు 'పుట్టిన' అభిమానం!

విశ్వాసం కోల్పోయిన తండ్రి.. ప్రజాదరణలేని కుమారుడు!

- కూపన్లను పంచి మరీ బర్త్‌డేకు ఆహ్వానం
- వేడుకకు వస్తేనే గిఫ్ట్‌లంటూ ఎర
- అభిమానం ఉందని చాటుకునే ప్రయత్నం
- ఇప్పటికే ప్రజల్లో విశ్వసనీయత కోల్పోయిన టీజీ కుటుంబం
- తాజాగా రూ.5కోట్లకు పైనే ఖర్చుచేసి నవ్వులపాలు



ఎవరిదైనా బర్త్‌డే జరిగితే అభిమానంతో వెళ్తాం. పుష్పగుచ్ఛమిచ్చి స్వీట్లు తినిపిస్తాం. ఇంకా దగ్గరి వాళ్లయితే కేక్ తీసుకెళ్లి కట్ చేయిస్తాం. వీలైతే ఒక గిఫ్ట్ కూడా ఇస్తాం. కానీ ఓ టీడీపీ నేత తన బర్త్‌డేకు రమ్మని ఏకంగా కూపన్లు పంచిపెట్టాడు. వాళ్లు మాత్రమే వచ్చి శుభాకాంక్షలు తెలపాలి. అప్పుడే అక్కడ ఏర్పాటు చేసిన కౌంటర్లలో ఆ కూపన్లను చూసి రూ.700 విలువ చేసే గిఫ్ట్ ఇస్తారు. లేకపోతే వచ్చిన దారిలో వెళ్లిపోవాల్సిందే. ఇదండీ కథ. తండ్రి ప్రజల్లో విశ్వాసం కోల్పోతే.. కుమారుడు లేని ప్రజాదరణను చూపించుకునేందుకు తన బర్త్‌డేను వేదికగా చేసుకోవడం నవ్వుల పాలైంది. నాయకుడి బర్త్‌డే అంటే స్వచ్ఛందంగా వచ్చి శుభాకాంక్షలు తెలుపుతారు కానీ.. ఇదెక్కడి విడ్డూరమని కొందరంటే, ఆ ఫ్యామిలీ అంతే పబ్లిసిటీ పిచ్చి అంటూ మరి కొందరు నోరు చేసుకున్నారు.

– సాక్షి ప్రతినిధి కర్నూలు

బీజేపీ నేత టీజీ వెంకటేశ్ కుమారుడు, టీడీపీ కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ టీజీ భరత్ బర్త్‌డే శనివారం జరిగింది. 2014, 2019 రెండు సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి చెందిన టీజీ కుటుంబానికి రానున్న 2024 ఎన్నికలు అత్యంత కీలకం! ఆ ఎన్నికల్లో పరాభవం చెందితే 'హ్యాట్రిక్' ఓటముల దెబ్బకు రాజకీయాల నుంచి టీజీ ఫ్యామిలీ దూరమయ్యే పరిస్థితి. దీంతో ఎలాగైనా నియోజకవర్గంలో తనకు బలముంది, ప్రజల మద్దతు ఉందని చూపించుకునేందుకు తన బర్త్‌డేను ఎంచుకున్నారు. నాలుగేళ్లుగా జనం మధ్య లేరు, చంద్రబాబు వచ్చినా జనం వచ్చే పరిస్థితి లేదు. దీంతో తన బర్త్‌డేకు జనం రారని భరత్ ముందే ఊహించినట్లున్నాడు. అందులో భాగంగా ఓ ప్లాన్ వేశాడు. డబ్బులిచ్చి ఎన్నికల ప్రచారానికి జనాలను పిలిపించుకున్నట్లు 'గిఫ్ట్'లు ఎరగా వేశాడు. నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో టీడీపీ నాయకులను పది రోజుల కిందట పిలిపించి సమావేశం నిర్వహించాడు. తన బర్త్‌డే వేడుకకు రూ.700 విలువ చేసే గిఫ్ట్ ఇస్తామని, దాని కోసం ఓ జాబితా తయారు చేయాలని, ఆ ప్రకారం కూపన్లు అందజేసి గిఫ్ట్‌లు పంపిణీ చేద్దామని నిర్ణయించారు. ఆ మేరకు జాబితాలు తయారయ్యాయి. వ్యక్తుల పేరు, ఓటర్ ఐడీ నెంబర్, పోలింగ్ బూత్ నెంబర్, ఫోన్ నెంబర్‌తో కూపన్ ప్రింట్ చేయించారు. ఈ కూపన్లను నియోజకవర్గంలోని డివిజన్లలో తమ పార్టీ సానుభూతిపరులకు పంపిణీ చేశారు. వీరు ఎస్టీబీసీ మైదానంలో ఏర్పాటు చేసిన వేడుకకు వచ్చి భరత్‌కు శుభాకాంక్షలు చెప్పి, భోజనం చేసి చివరలో గిఫ్ట్‌లు తీసుకెళ్లేలా ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. పొదుపు మహిళలకు ముక్కుపుడకలు.. కొందరికి గిఫ్ట్‌లు, ఇలా మొత్తం పుట్టిన రోజు ముసుగులో లేని అభిమానానికి ఈ బర్త్‌డే బాయ్ చేసిన ఖర్చు అక్షరాల రూ.5కోట్ల పైనే.

జనం బలం ఉందని చూపించుకునే తాపత్రయం

టీజీ వెంకటేశ్ కుటుంబంపై ప్రజల్లో విశ్వసనీయత లేదు. టీడీపీలో ఉన్న టీజీ వెంకటేశ్ 2004 ఎన్నికల తర్వాత కాంగ్రెస్‌లో చేరారు. 2014లో తిరిగి టీడీపీలోకి వచ్చారు. 2019 ఎన్నికల తర్వాత బీజేపీలో చేరారు. కుమారుడు మాత్రం టీడీపీలోనే కొనసాగుతున్నాడు. తన వ్యాపార సామ్రాజ్యాన్ని కాపాడుకునేందుకు ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలో చేరడం మినహా టీజీ వెంకటేశ్‌కు రాజకీయ స్థిరత్వం లేదనేది తన రాజకీయ ప్రస్థానాన్ని విశ్లేషిస్తే స్పష్టమవుతోంది. అలాగే తండ్రీకొడుకుల్లో ఒకరు బీజేపీ, మరొకరు టీడీపీలో ఉండటం అవకాశవాద రాజకీయాన్ని సుస్పష్టం చేస్తోంది. పాత రోజులు కాకుండా ప్రజలు రాజకీయంగా చైతన్యం అయ్యారు. దీంతో టీజీ కుటుంబం అవకాశవాద రాజకీయాలను పసిగట్టి వారికి దూరంగా ఉన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో టీడీపీ అత్యంత బలహీనపడింది. ఒకే నియోజకవర్గంలో టీడీపీ, బీజేపీ నేతలుగా ఉన్న వీరు రాజకీయంగా ఏ రోజు పరస్పరం విమర్శించుకున్నదీ లేదు. తమ రాజకీయాల కోసం ఏ క్షణం, ఏ పార్టీలోనైనా చేరే నేతగా టీజీ వెంకటేశ్ ప్రజల్లో విశ్వసనీయత కోల్పోయారు. ఆయన కుమారుడు భరత్ నాలుగేళ్లలో విపక్షపార్టీ నేతగా పోరాటం చేసిందీ లేదు. కేవలం ఎన్నికలకు ముందు బలప్రదర్శన చేసుకోవాలని భావించి, బలం లేక ఆర్థికబలంతో కోట్లు ఖర్చు చేసి గిఫ్ట్‌లు పంపిణీ చేసి వాటి కోసం వచ్చిన వారిని తమ అభిమానులుగా చిత్రీకరించుకుని రాజకీయ అడుగులు వేసే ప్రయత్నం చేశాడు.

ఎన్నికల 'వేడుక'




టీడీపీ నాయకుడు భరత్ పిచ్చి పరాకాష్టకు ఈ వేడుక తాజా నిదర్శనం. పుట్టిన రోజుకు రావాలని పిలవడం బాగుంటుంది కానీ, ఏకంగా ఓటరు ఐడీ జిరాక్స్ కాపీ జత చేసి తీసుకురావాలని కూపన్ల మీద కొట్టించడం ఇదంతా ఎన్నికల వేడుక అని చెప్పకనే చెప్పినట్లయింది. ఇంతేకాదు.. కూపన్ల మీద ఇచ్చిన వివరాలన్నీ ఓటరు ఐడీ కార్డు తరహాలో ఉండటం గమనార్హం. ఓటరు ఐడీ నెంబర్, బుక్ ఫోలియో, వార్డు నెంబర్, బూత్ నెంబర్‌ను పంపిణీ చేసిన కూపన్లపైనే ముద్రించారు. డేటా చౌర్యం గురించి మాట్లాడే టీడీపీ నేతలు కూపన్ల మాటున ఏకంగా ఓటరు ఐడీలనే బజారుకు తీసుకురావడం ఏమనుకోవాలనే చర్చకు తావిస్తోంది.

చంద్రబాబు వద్ద విశ్వసనీయత కోల్పోయారా?!

లక్కీటు బ్రదర్స్‌గా చెప్పుకునే రాంపుల్లయ్య యాదవ్, నరసింహులు యాదవ్‌లను పార్టీ నుంచి తప్పించాలని భరత్ ప్రయత్నించాడు. నియోజకవర్గంలో జరిగిన బస్సుయాత్రలో కూడా లక్కీటు బ్రదర్స్ పాల్గొనలేదు. దీంతో వీరు చంద్రబాబుకు భరత్‌పై ఫిర్యాదు చేశారు. ఆ మేరకు అధిష్టానం భరత్, లక్కీటు బ్రదర్స్‌ను ఇద్దరినీ పిలిపించి వేర్వేరుగా మాట్లాడారు. రాజకీయంగా బలపడాలంటే చేరికలపై దృష్టి పెట్టేవారిని చూశానని, పార్టీలో ఉన్నవారిని బయటకు పంపే నేతను చూడలేదని భరత్‌ను చంద్రబాబు హెచ్చరించినట్లు టీడీపీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. 50 ఓట్లు ఉన్న వ్యక్తి కూడా మనకు ముఖ్యమేనని, సర్దుకుని పోవాలని సూచించారు. పైగా భరత్, టీజీ వెంకటేశ్ వేర్వేరు పార్టీల్లో ఉండటంతో టీడీపీ నియోజకవర్గంలో నష్టపోయిందని, ఇద్దరూ ఒకే పార్టీలో ఉంటేనే టిక్కెట్ ఇచ్చే ఆలోచన చేస్తామని.. లేదంటే పార్టీ ప్రత్యామ్నాయం ఆలోచిస్తుందని స్పష్టం చేసినట్లు సమాచారం. ఈ క్రమంలో బలం నిరూపించునే ప్రయత్నంలో తన బర్త్‌డే వేడుకను అవకాశంగా తీసుకున్నాడు భరత్. అయితే ఈ వేడుకపై ఇటు ప్రజల్లో, రాజకీయ పార్టీల్లో తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బర్త్‌డే వేడుకల్లో భరత్ కొత్త సంప్రదాయానికి తెర తీశాడని, ప్రతీ అంశాన్ని రాజకీయంగా చూడటం సరికాదని చర్చకు దారితీసింది.

రక్తపాతాన్ని సృష్టించడం దారుణం

● కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం



ఆలూరు: సాగునీటి ప్రాజెక్టుల పరిశీలన పేరుతో టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబునాయుడు రక్తపాతాన్ని సృష్టించడం దారుణమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. దేవనకొండ మండలం నేలతలమర్రి గ్రామంలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి విలేకరులతో మాట్లాడుతూ.. చంద్రబాబు ప్రతిచోటా టీడీపీ కార్యకర్తలను రెచ్చగొడుతూ అల్లర్లు జరిగే విధంగా వ్యవహరిస్తున్నారన్నారు. పుంగనూరులో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు, పోలీసు అధికారులపై రాళ్లు, రాడ్లు, కర్రలు, బీరు బాటిళ్లు, తుపాకులతో దాడులకు పాల్పడం దారుణమని మంత్రి ఖండించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ చంద్రబాబు పర్యటనలు సాగుతున్నాయని, వాటికి ప్రభుత్వం అనుమతులు రద్దు చేయాలని కోరారు. నరరూప రాక్షసుడిగా చంద్రబాబు కనిపిస్తున్నారని, ఆయన పర్యటించే ప్రాంతంలో ప్రజల ప్రాణాలకు భద్రత లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పుంగనూరు లాంటి ఘటనలు జరగకుండా టీడీపీ సభలను బహిష్కరించేందుకు ప్రత్యేకంగా చర్యలు తీసుకోవాలని మంత్రి కోరారు.

శోభాయమానంగా శ్రీవారి పుష్పార్చన



పగడాల ఆనంద తీర్థాచార్యులకు అవార్డు అందజేస్తున్న పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు



దేవతామూర్తికి పుష్పార్చన చేస్తున్న టీటీడీ అర్చకులు

మంత్రాలయం: ప్రసిద్ధ రాఘవేంద్ర స్వామి మఠంలో శ్రీ వెంకటేశ్వర స్వామి, భూదేవి, లక్ష్మీదేవి పుష్పార్చన వేడుక శోభాయమానంగా జరిగింది. టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్ట్ ప్రత్యేకాధికారి సగడాల ఆనంద తీర్థ చార్యుల ఆధ్వర్యంలో శనివారం ఈ వేడుక చేపట్టారు. శ్రీమఠం ఊంజల మంటపంలో వేదమంత్రోచ్చారణల మధ్య శ్రీదేవి, భూదేవి, సమేత శ్రీవారికి పుష్పార్చన నిర్వహించారు. స్వామిజీ సుబుదేంద్ర తీర్థులు ముందుగా శ్రీవారికి ప్రత్యేక పూజలు చేసి పుష్పార్చనకు అంకురార్పణ పలికారు. అనంతరం పీఠాధిపతి అనుగ్రహ సందేశం ఇచ్చారు.

పగడాలకు అవార్డు

దాస సాహిత్యంలో ప్రతిభ కనబరుస్తున్న టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్ట్ ప్రత్యేకాధికారి పగడాల ఆనందతీర్థచార్యులను శ్రీమఠం పీఠాధిపతి ఘనంగా సత్కరించారు. 'హరి దాస సాహిత్య భూషణ్' అవార్డుతో సన్మానించారు. వేడుకల్లో శ్రీమఠం ఏఏఓ మాధవ శెట్టి, మేనేజర్-1 శ్రీనివాస రావు, మేనేజర్-2 వెంకటేష్ జోషి, వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.

చంద్రబాబును రాష్ట్ర బహిష్కరణ చేయాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ రామయ్య, చిత్రంలో మాజీ ఎంపీ బుట్టా రేణుక తదితరులు

కర్నూలు(రాజ్‌విహార్): రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్న టీడీపీ అధినేత చంద్రబాబును రాష్ట్ర బహిష్కరణ చేయాలని వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు, మేయర్ బీవై రామయ్య అన్నారు. శనివారం స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యాత్రల పేరుతో చంద్రబాబు కుల మతాలు, వర్గాల మధ్య చిచ్చు పెట్టి అల్లర్లు, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నాడన్నారు. ఈ క్రమంలోనే పుంగనూరులో ఘటన జరిగిందని, ఇందుకు ఆయనే కారణమన్నారు. బైపాస్‌లో వెళ్లేందుకు అనుమతి తీసుకొని ఊరులోకి వెళ్లారని.. పోలీసులు, భద్రతా సిబ్బంది వద్దని చెప్పినా వినకుండా వెళ్లి రెచ్చగొట్టారన్నారు. దీంతో 50 మంది వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తలు గాయపడడంతో పాటు 30 మంది పోలీసులు గాయాలయ్యాయని తెలిపారు. కోర్టులు ఆయనపై సుమోటో కేసు నమోదు చేయాలని కోరారు. తన 30 ఏళ్ల రాజకీయ చరిత్రలో ఇలాంటి దుర్మార్గ ప్రతిపక్ష నాయకుడిని చూడలేదన్నారు. గతంలో అల్లర్లు, అలజడులకు ఉసిగొలిపే వారిని ఎస్పీలు జిల్లా బహిష్కరణ చేసేవారని, అలా చంద్రబాబును రాష్ట్ర బహిష్కరణ చేసి ప్రశాంతత నెలకొల్పాలన్నారు. 40 ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకునే చంద్రబాబు సభల్లో 'తన్నండ్రా, కొట్టండ్రా' అంటూ రెచ్చగొట్టడమే పనిగా పెట్టుకున్నాడన్నారు. ఆయన తనయుడు పప్పు కూడా ఇలాంటి ధోరణితోనే ఉన్నాడన్నారు. పాదయాత్రకు జన స్పందన లేకపోవడంతో రెచ్చగొట్టడమే పనిగా పెట్టుకున్నాడన్నారు. 'ఎవరెన్ని కేసులు అధికంగా పెట్టించుకుంటే.. వారినే పెద్ద నాయకుడి'గా భావిస్తామని చెప్పడం చూస్తే లోకేష్ ఎలాంటి రాజకీయాలు చేస్తున్నాడో అర్థమవుతుందన్నారు. దత్తపుత్రుడు పవన్ కళ్యాణ్ కూడా అదే తరహాలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నాడని, వీరిని నమ్ముకొని కేసుల్లో ఇరుక్కుంటే జీవితాలు, కుటుంబాలు నాశనం అవుతాయని టీడీపీ కార్యకర్తలు గుర్తుంచుకోవాలని సూచించారు.

పార్టీ గెలుపునకు శ్రమిస్తా

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తా. నా రాజకీయ భవిష్యత్తు విషయంలో పచ్చ పత్రికలు లేనిపోని కట్టుకథలు ప్రచురిస్తున్నాయి. అవన్నీ అవాస్తవాలు. వ్యాపారం చేసుకునే నాకు వైఎస్సార్‌సీపీ రాజకీయంగా ఉన్నతస్థానం ఇచ్చింది. వైఎస్ జగన్ చలువతోనే 2014లో ఎంపీగా గెలుపొంది ప్రజలకు సేవ చేసే అదృష్టం లభించింది. కొన్ని కారణాలతో పార్టీకి దూరమైనా 2019 ఎన్నికల సమయంలో తిరిగి వైఎస్సార్‌సీపీలోకి వచ్చి నా శక్తి మేరకు పార్టీకి సేవ చేస్తున్నా. రానున్న ఎన్నికల్లోనే పార్టీ గెలుపునకు శ్రమిస్తా. – బుట్టా రేణుక, మాజీ ఎంపీ

'వైఎస్సార్' పురస్కారాలకు వివరాలు పంపండి

● సీఎస్ డాక్టర్ జవహర్‌రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ సృజన, జేసీ మౌర్య

కర్నూలు(సెంట్రల్): వివిధ రంగాల్లో సేవలందించిన వారిని గుర్తించి వైఎస్సార్ జీవిత సాఫల్య పురస్కారాలకు ఈ నెల 20వ తేదీలోపు వివరాలను పంపాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి ఆదేశించారు. శనివారం ఆయన విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివిధ అంశాలపై కలెక్టర్లు, జేసీలతో సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరుసగా మూడో ఏడాది వైఎస్సార్ జీవిత సాఫల్య పురస్కారాలను అందజేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. వ్యవసాయం, లలిత కళలు, సంస్కృతి, మహిళా సాధికారత, విద్య, జర్నలిజం విభాగాల్లో ఉత్తమ సేవలు అందించిన వారిని గుర్తించాలన్నారు. అక్టోబర్ 2న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభిస్తారని, అప్పటిలోపు అన్ని జిల్లాలో ఎంపిక చేసిన ఆటలకు అవసరమైన క్రీడా మైదానాలను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ జి.సృజన, జేసీ నారపురెడ్డి మౌర్య పాల్గొన్నారు.

బడి బయట ఉన్న పిల్లలను గుర్తించండి

బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం ఆమె విద్యాశాఖ అధికారులతో వివిధ అంశాలపై టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడతూ... బడి బయట పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించి స్టూడెంట్ ఇన్ఫోలో చేర్పించే బాధ్యత డీఈఓ, ఏపీసీ, ఎంఈఓల దేనన్నారు.

క్లుప్తంగా

గట్టెక్కి పారుతున్న ఎల్లెల్సీ నీరు



ప్యాలకుర్తి వద్ద ఎల్లెల్సీ గట్టెక్కి పారుతున్న నీరు

కోడుమూరు రూరల్: తుంగభద్ర దిగువ కాలువకు నీరు ప్యాలకుర్తి గ్రామం వద్ద గట్టు ఎక్కి పారుతున్నాయి. దీంతో సుమారు 60 ఎకరాల్లో పంట పొలాలు నీటి మునిగాయి. కాల్వలో పూడిక తీయకుండా నీటిని వదలడంతో ఈ దుస్థితి తలెత్తిందని రైతులు మునీర్ బాషా, నారాయణ, బందెనవాజ్, సులేమాన్, షేక్షాలు వాపోయారు. నష్టపోయిన తమ పొలాలకు పరిహారం చెల్లించి ఆదుకోవాలని వారు కోరారు.

నేడు దివ్యాంగులకు కొలతల స్వీకరణ

కర్నూలు కల్చరల్: భారత్ వికాస్ పరిషత్ తుంగభద్ర శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ అవయవాల పంపిణీకి సంబంధించి కొలతలు ఆదివారం స్వీకరిస్తున్నట్లు సంస్థ కార్యదర్శి బైరెడ్డి చిరంజీవి రెడ్డి, బీవీపీ తిరుపతి ప్రాంత సేవా ప్రముఖ్ రేగూరు బాలకృష్ణ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. బుధవార పేటలోని కేశవ మెమోరియల్ పాఠశాలలో ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. కృత్రిమ అవయవాలకు దరఖాస్తు చేసుకున్నవారు హాజరుకావాలని తెలిపారు. మెడికల్ నిపుణులచే పరీక్షలు నిర్వహించి కొలతలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. దాతలు, కమిటీ సభ్యులు కార్యక్రమంలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. మరిన్ని వివరాలకు 90000 88660, 81425 50143 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(రూరల్): రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు 2023 సంవత్సరానికి వైఎస్సార్ లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డ్‌లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా క్రీడా శాఖ సీఈఓ రమణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. క్రీడా రంగంలో జాతీయ/అంతర్జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులు ఈ నెల 20వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు rportrinap@fmai.com లేదా incentiver.rchemer@fmai.com మెయిల్‌కు దరఖాస్తులను పంపాలని పేర్కొన్నారు.

ఐలూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల ఎన్నిక





సింగరాజు లక్ష్మన్న కెంగార కుమార్

కర్నూలు(లీగల్): నగరంలో శనివారం ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలూ) 4వ జిల్లా మహాసభ జరిగింది. ఈ సందర్భంగా కర్నూలు జిల్లా ఐలు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా సింగరాజు లక్ష్మన్న, కెంగార కుమార్‌ను ఎన్నుకున్నారు. అలాగే 12 మందిని కార్యవర్గ సభ్యులను, 18 మందిని జిల్లా కమిటీ సభ్యులను ఎన్నుకనున్నారు.

స్నేహ బంధం.. సేవా సుగంధం

నేడు స్నేహితుల దినోత్సవం

చాలా మంది మిత్రులు సమయం దొరికితే సినిమాకు వెళ్లడమో.. షికారు కొట్టడమో..సరదాగా ఆటలు ఆడటమో చేస్తుంటారు. కొందరు కబుర్లు చెప్పుకుంటూ కాల క్షేపం చేస్తుంటారు. చాలా తక్కువ మంది మాత్రమే ఇతరుల గురించి ఆలోచిస్తుంటారు. సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తుంటారు. స్వార్థం చూసుకోకుండా పరోపకారానికి ప్రాధాన్యత ఇస్తుంటారు. అనాథాశ్రమాలకు నిత్యావసరాలను అందించడం.. అభాగ్యులను ఆదుకోవడం.. ప్రమాదంలో గాయపడిన వారికి రక్తదానం చేయడం.. పర్యావరణ పరిరక్షణకు కృషి చేయడం..ఇలా పలు కార్యక్రమాలు నిర్వహిస్తూ స్నేహ బంధంలో వీరు సేవా సుగుంధాలను విరజిమ్ముతున్నారు. ఆదివారం స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఇలాంటి స్నేహితులపై ప్రత్యేక కథనం.. – కర్నూలు కల్చరల్



ఆదర్శంగా నిలుస్తూ..



చిన్నారులతో సరదాగా ఉన్న వీరు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు. హైదరాబాద్, బెంగళూరు నగరాల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. వీరంతా ఉమ్మడి కర్నూలు జిల్లాలోని వివిధ ఇంజినీరింగ్ కళాశాలల్లో బీటెక్ పూర్తి చేశారు. చదువుకునే సమయంలో స్నేహితులయ్యారు. సమయం దొరికినప్పుడల్లా కలుస్తుంటారు. సేవా కార్యక్రమాలు మాత్రం క్రమం తప్పకుండా చేస్తుంటారు. ఆశ్రమాలకు వెళ్లి అనాథలకు, వృద్ధులకు సపర్యలు చేయడంతోపాటు ఆహార పదార్థాలు అందజేస్తున్నారు. రక్తదానం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. సేవ..స్నేహం..వీటిని వదులుకోబోమని భువన, శృతి, శ్రీకాంత్, చిన్ను, జీవన, వేణు, అహ్మద్, హర్ష చెబుతున్నారు.

ఆపన్న హస్తం అందిస్తూ..



వీరంతా చిన్ననాటి స్నేహితులు. ఆదోని వైఎంకే పాఠశాలలో 1997–98 సంవత్సరంలో చదువుకున్నారు. ఒక బృందంగా ఏర్పడి తోటి మిత్రులకు ఏ ఆపద వచ్చినా అండగా నిలుస్తున్నారు. కరోనా సమయంలో మిత్రులు రమేష్, మల్లికార్జున మృతి చెందగా వారి కుటుంబాలకు రూ.50,000, రూ.1,00,000 అందించారు. ఇటీవల రామలింగ కిడ్నీ సమస్యలతో బాధపడుతూ ఉండగా గమనించి, కిడ్నీ మార్పిడి చేసుకోవడానికి రూ. 2,00,000 అందించారు. ఆపదలో ఉన్న మిత్రులను ఆదుకోవడం కన్నా గొప్పతనం ఇంకేముంటుందని రమణ, మహేందర్‌రెడ్డి, బద్రినాథ్, నరేంద్రకుమార్, కిరణకుమార్ తెలిపారు. – ఆదోని సెంట్రల్

సామాజిక బాధ్యతగా..



ఈ చిత్రంలోని ఉన్న స్నేహితులు హర్ష, దివ్య, చంద్రజ, విజయశ్రీ, మహాలక్ష్మి, శ్రావణి, నేహ, లిఖిత రెడ్డి. వీరు చదువుకుంటూ సామాజిక బాధ్యతగా పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. రక్తదాన శిబిరం నిర్వహించడంతో ఫ్రెండ్స్ బ్లడ్ గ్రూపింగ్ లిస్ట్ పెట్టుకొని ఆపద వేళల్లో అవసరం ఉన్నవారికి రక్తం ఇస్తున్నారు. జాతీయ పర్వదినాలు, పుట్టిన రోజు వేడుకల్లో అనాథ, వృద్ధాశ్రమాలకు వెళ్లి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పల్లెలకు వెళ్లి ప్రజలకు పలు సామాజిక రుగ్మతపై అవగాహన కల్పిస్తున్నారు.

సమాజ హితమే లక్ష్యంగా..



చదువే కాదు సామాజిక సేవ కూడా ముఖ్యమని నమ్మి వీరంతా మిత్రులయ్యారు. కర్నూలు నగరంలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో వివిధ బ్రాంచ్‌ల్లో బీటెక్ చదువుతున్న వీరు స్నేహితులుగా ఉంటూ ఎవరైనా ఇబ్బందులు, సమస్యల్లో ఉంటే వారికి అండగా నిలుస్తున్నారు. శీతాకాలంలో పేదలకు దుస్తులు, స్వెటర్లు, దుప్పట్లు పంపిణీ చేస్తున్నారు. శ్రీశైలానికి పాదయాత్ర చేసే భక్తులకు ప్రథమ చికిత్స చేయిచండం, మందులు పంపిణీ చేయడం చేస్తున్నారు. కళాశాలలో రక్తదాన శిబిరాలు చేపడుతున్నారు. మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తూ పర్యావరణ హితాన్ని గుర్తు చేస్తున్నారు. సేవా సంకల్పం ప్రతి ఒక్కరికీ అవసరమని, అదే సమాజాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దుతుందని సాయి చరణ్, భార్గవ్, మనీష్ చంద్ర, శరత్, గోపాల్, విజయ్, వరుణ్, సుభాష్, యశ్వంత్, నవీన్, హరికృష్ణ, రామకృష్ణ చెబుతున్నారు.

హాస్టళ్ల నిర్వహణలో నిర్లక్ష్యాన్ని సహించం

- జిల్లా బీసీ సంక్షేమ, సాధికారత అధికారిణి పీ వెంకటలక్ష్మమ్మ



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటలక్ష్మమ్మ

కర్నూలు(అర్బన్): ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల నిర్వహణలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని జిల్లా బీసీ సంక్షేమ, సాధికారత అధికారిణి పీ వెంకటలక్షుమ్మ హెచ్చరించారు. శనివారం స్థానిక బీసీ స్టడీ సర్కిల్‌లోని సమావేశం హాల్‌లో జిల్లాలోని బీసీ వసతి గృహ సంక్షేమాధికారులతో హాస్టళ్ల నిర్వహణపై వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వసతి గృహాల్లోని విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టికాహారం అందించాలన్నారు. జీఓ నెంబర్: 46 ప్రకారం వసతి గృహాలను సమీపంలోని గ్రామ, వార్డు సచివాలయాల్లోని వెల్ఫేర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఏఎన్ఎం, మహిళా పోలీసు, పీహెచ్‌సీ వైద్యాధికారులు సందర్శించి, పరిశీలనలో తేలిన అంశాలను నివేదిక రూపంలో సహాయ బీసీ సంక్షేమాధికారులకు అందించాల్సి ఉందన్నారు. అలాగే సహాయ బీసీ సంక్షేమాధికారులు విధిగా హాస్టళ్లను తనిఖీలు చేసి నివేదికలను తమకు అందించాల్సి ఉందన్నారు. తమకు అందిన నివేదికలను బీసీ సంక్షేమ శాఖ డైరెక్టరేట్‌కు పంపుతామన్నారు. త్వరలో డివిజన్ స్థాయిల్లో కూడా ఆయా వసతి గృహాల్లోని నాల్గో తరగతి సిబ్బందితో కలిసి వర్క్‌షాప్‌లు నిర్వస్తామన్నారు. కార్యక్రమంలో సహాయ బీసీ సంక్షేమ శాఖ అధికారిణి ఎస్ లీలావతి, వసతి గృహ సంక్షేమాధికారులు హాజరయ్యారు.

జీవనోపాధులను అభివృద్ధి చేసుకోవాలి

- జిల్లా సమాఖ్య సమావేశంలో డీఆర్‌డీఏ–వైకేపీ పీడీ నాగశివలీల



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ–వైకేపీ పీడీ నాగశివలీల

కర్నూలు(అగ్రికల్చర్): స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు జీవనోపాధులు అభివృద్ధి చేసుకుని స్థిరమైన ఆదాయాన్ని పొందడంపై దృష్టి సారించాలని డీఆర్‌డీఏ–వైకేపీ ప్రాజెక్టు డైరెక్టర్ నాగశివలీల అన్నారు. ఆదోని ఏరియా డెవలప్‌మెంటు అథారిటీ(ఏఏడీఏ) పరిధిలోని మండలాల్లో జీవనోపాధుల అభివృద్ధిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. శనివారం కర్నూలు శివారులోని డీఆర్‌డీఏ–వైకేపీ శిక్షణ కేంద్రంలో జిల్లా సమాఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ.. పొదుపు మహిళలు తమకు ఆసక్తి ఉన్న వృత్తుల్లోనే రాణించేందుకు తగిన ఆర్థిక తోడ్పాటు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. పాఠశాలలు, కాళాశాలల్లో విద్యార్థుల స్థూల నమోదు ప్రక్రియ (జీఇఆర్)గణనీయంగా తగ్గుతోందని, డ్రాప్‌అవుట్స్ పిల్లల్ని పాఠశాలల్లో చేర్పించడానికి పొదుపు మహిళలు చొరవ తీసుకోవాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. పొదుపు మహిళల్లో చాలా మంది వ్యవసాయంలో రాణిస్తున్నారని, వీరందరు ప్రకృతి వ్యవసాయం చేయాలని సూచించారు. జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు సీతాబాయి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో డీఆర్‌డీఏ–వైకేపీ అదనపు పీడీ శ్రీధర్‌రావు, డీపీఎంలు నరసమ్మ, రెహ్మాన్, అయ్యమ్మ, జిల్లా సమాఖ్య మేనేజర్ హేమలత, రైతుసాధికార సంస్థ అధికారి లక్ష్మయ్య, జిల్లా సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

'నెట్'లో మెరిసిన పేదింటి విద్యార్థి

- జాతీయ స్థాయిలో 78వ ర్యాంకు



వెంకటకృష్ణ

ఓర్వకల్లు: సీఎస్ఐఆర్ యూజీసీ నెట్‌లో ఓర్వకల్లు మండలం ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన పీఎస్‌వి కృష్ణ ప్రతిభ కనబరిచాడు. ఈ ఏడాది జూన్‌లో ప్రవేశ పరీక్ష రాయగా ఈనెల 2వ తేదీన ఫలితాలు వెలువడ్డాయి. జాతీయ స్థాయిలో 78వ ర్యాంకు సాధించాడు. వివరాలు ఆయన మాటల్లోనే..'' మా తల్లిదండ్రులు కృష్ణవేణి, రామకృష్ణ దంపతులు. వ్యవసాయ కూలీ పనులు చేసేవారు. నాకు పుస్తకాలు కొనేందుకు కూడా ఆర్థిక స్థోమత లేదు. ఇతరుల పుస్తకాలు తీసుకుని చదువుకునేవాణ్ని. కాల్వబుగ్గ గురుకుల పాఠశాలలో పదో తరగతి చదివాను. కర్నూలులో ఇంటర్, తిరుపతి ప్రభుత్వ కళాశాలలో డిగ్రీ బీఎస్సీ పూర్తి చేశాను. ఆ తర్వాత రాంచిలోని జార్ఖండ్ సెంట్రల్ యూనివర్సిటీటీ ఎంఎస్సీ కెమిస్ట్రీ పూర్తి చేశాను. శాస్త్రవేత్తను కావాలనే ఆశయంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ స్కూల్లో పనిచేస్తూ సీఎస్ఐఆర్ యూజీసీ నెట్‌కు సిద్ధమయ్యాను. జాతీయ స్థాయిలో 78 ర్యాంక్ వచ్చింది. ఈ పరీక్షలో దేశవ్యాప్తంగా 50 వేల మంది పాల్గొనగా, అందులో మన రాష్ట్రం నుంచి అత్యుత్తమ ర్యాంకులు సాధించిన 20 మందిలో నేను ఒకడిగా ఉన్నాను. చిన్నప్పుడు గురువులు చెప్పిన మాటలను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు వెళ్లుతున్నాను. మా కుటుంబ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ఉన్నత చదువులు చదవాలంటే డబ్బుతో కూడిన వ్యవహారమనే ఆలోచన నన్ను వేధిస్తోంది. ఎవరైనా దాతలు సహకరిస్తే శాస్త్రవేత్తగా దేశానికి సేవలు అందిస్తాను''

ఆరోగ్యశ్రీలో పేదలందరికీ కార్పొరేట్ వైద్యం

- విలేకరుల సమావేశంలో ఆరోగ్యశ్రీ స్టేట్ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ అశోక్ బాబు



మాట్లాడుతున్న డాక్టర్ అశోక్ బాబు

కర్నూలు(రాజ్‌విహార్): ఆరోగ్య శ్రీ పథకం ద్వారా పేదలందరికీ కార్పొరేట్ వైద్యం ఉచితంగా అందుతోందని డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ స్టేట్ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ అశోక్ బాబు అన్నారు. శనివారం స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైద్య, ఆరోగ్య రంగం అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.16వేల కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం 5 వేల జనాభా ఉన్న ప్రతి గ్రామానికి ఒక సబ్ సెంటర్ ఉండాలని చెబితే, ఏపీలో 2వేల జనాభా ఉన్న ప్రతి గ్రామానికి ఒక హెల్త్ క్లినిక్ ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. గ్రామీణ వైద్య విభాగాన్ని బలోపేతం చేసేందుకు 10,032 వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేస్తున్నామని, వీటి ద్వారా 14 రకాల వైద్య పరీక్షలు, 67 రకాల మందులను ఉచితంగా అందించనున్నట్లు పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆదిమూలపు సతీష్ మాట్లాడుతూ.. దేశ చరిత్రలో ఫ్యామిలీ ఫిజీషియన్ విధానాన్ని ఏపీలో రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిందన్నారు. టెలిమెడిసిన్ ద్వారా పేదలకు స్పెషలిస్టు వైద్యులు సేవలు అందిస్తున్నారని, రోజుకు 60వేల కాల్స్ వస్తున్నాయని చెప్పారు. ఆరోగ్యశ్రీ సేవల్లో లోపాలు ఉంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. కొత్తగా 108, 104 వాహనాలు కొనుగోలు చేయడంతో పాటు 16 కొత్త మెడికల్ కళాశాలలు మంజూరు చేసిన ఘనత సీఎం జగన్‌దే అన్నారు. ఆరోగ్యశ్రీలోని 1,000 రోగాల పరిధిని 2,466కి పెంచిన ఘనత ప్రభుత్వానిదే అన్నారు. ఈ సమావేశంలో పార్టీ వైద్య విభాగం జోనల్ ఇన్‌చార్జ్ డాక్టర్ హరికృష్ణారెడ్డి, జిల్లా అధ్యక్షుడు కృష్ణమూర్తి పాల్గొన్నారు.

నేర పరిశోధనలో ఫోరెన్సిక్ పాత్ర కీలకం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ డాక్టర్ పి. సుధాకర్

కర్నూలు(హాస్పిటల్): నేర పరిశోధనలో ఫోరెన్సిక్ విభాగం పాత్ర చాలా కీలకమని, ఎన్నో నేరాలకు ఫోరెన్సిక్ వారు ఇచ్చిన నివేదికల కారణంగా ఆధారాలు లభ్యమయ్యాయని కర్నూలు మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సుధాకర్ అన్నారు. కర్నూలు మెడికల్ కాలేజీలోని మెడికల్ ఎడ్యుకేషన్ యూనిట్‌లో శనివారం ఫోరెన్సిక్ విభాగం ఆధ్వర్యంలో జోనల్ సీఎంఈ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కర్నూలుతో పాటు అనంతపురం, నంద్యాల, వైఎస్ఆర్, నెల్లూరు, విజయవాడ ఉమ్మడి జిల్లాల నుంచి వైద్యులు, పీజీలు హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ పి. సుధాకర్ మాట్లాడుతూ.. కళాశాలలోని ఫోరెన్సిక్ మెడిసిన్ విభాగం వైద్యవిద్యతో పాటు విశేషమైన సేవలు అందిస్తోందన్నారు. ప్రతిరోజూ ఈ విభాగంలోని మార్చురిలో 6 నుంచి 8 పోస్టుమార్టమ్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గతంలో ఈ విభాగంలో ఒక పీజీ సీటు మాత్రమే ఉండేదని, తాము ఎన్ఎంసీ వారితో చర్చించి మరో ఐదు పీజీ సీట్లు సాధించినట్లు తెలిపారు. పీజీ సీటు, వైద్యులు పెరిగిన నేపథ్యంలో మరింత బాగా పనిచేసి కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. అనంతరం మెడికల్ లీగల్ ఇన్వెస్టిగేషన్ ఇన్ డాక్టర్ రోల్ అనే అంశంపై ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం వివరించారు. కార్యక్రమంలో ఫోరెన్సిక్ హెచ్‌వోడీ, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సాయిసుధీర్, ఫోరెన్సిక్ వైద్యులు బ్రహ్మాజి, వీరనాగిరెడ్డి, కృష్ణారావు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు శిశువుల మృతి

నంద్యాలటౌన్: సర్వజన ఆసుపత్రిలో వివిధ కారణాలతో ముగ్గురు శిశువులు శనివారం మృతి చెందారు. ఓ శిశువు సాధారణ బరువు కన్నా చాలా తక్కువగా ఉండడంతో బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు నంద్యాలకు రెఫర్ చేశారు. అలాగే నంద్యాలలోని ఓ ప్రైవేటు ఆసుపత్రి నుంచి ఇద్దరు నవజాత శిశువులను వారి కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం చేర్చారు. ముగ్గురు శిశువులు కోలుకోలేక మృతి చెందారు.